క్లుప్తంగా

సాయి భక్తుల భిక్షాటన



నీలకంఠాపురంలో భిక్షాటన చేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: పట్టణంలోని సాయినగర్‌లో ఉన్న షిరిడీ సాయి దేవాలయంలో ఈ నెల 21 గురు పౌర్ణమి వేడుకల సందర్భంగా నీలకంఠాపురం ఆలయ కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డి బుధవారం భక్తులతో కలిసి గ్రామంలో భిక్షాటన చేశారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో అందించిన బియ్యం, కంది పప్పు తదితర నిత్యావసర సరుకులను గురుపౌర్ణమి రోజు అన్నదాన కార్యక్రమంలో వినియోగిస్తామని భక్తులు తెలిపారు.

గడ్డి విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోండి

మడకశిర: పాడి రైతులకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీతో గడ్డి విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఆశాఖ ఏడీ అమర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడ్డి విత్తనాలు అవసరమైన రైతులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 70 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు అందిస్తామన్నారు. ఐదు కిలోల బ్యాగుకు రూ.150 చొప్పున ధర నిర్ణయించామన్నారు. అవసరమైన రైతులు పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ కాపీతో కార్యాలయానికి వచ్చి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

నేడు ముక్కాంజనేయ స్వామి జ్యోతుల ఉత్సవం

రొద్దం: ఆర్ కుర్లపల్లి గ్రామ సమీపాన వెలసిన ముక్కాంజనేయస్వామికి గురువారం జ్యోతుల ఉత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. ఉదయం అభిషేకాలు, అర్చనలతో ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. అనంతరం అంజన్నకు మహిళలు జ్యోతులతో మోస్తారని తెలిపారు.

అంధకారంలో పెనుకొండ



పట్టణంలో అంధకారమైన వీధి

పెనుకొండ: పట్టణంలోని మారుతి నగర్, బీటీ ఆర్ కాలనీ, శ్రీరాములయ్య కాలనీ ఆర్టీసీ బస్టాండ్, దర్గాపేట ఏరియాలో రాత్రి వేళ అంధకారం నెలకొంది. ఎన్నికల ఫలితాలు వెల్లడైన రెండో రోజు నుంచే ఇలాంటి పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. పలుమార్లు వీధిలైట్లు వేయాలని కోరుతున్నా అధికారులు స్పందించడం లేదని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు చెబుతున్నారు. రెవెన్యూ డివిజన్ కేంద్రంలోనే వీధి లైట్లు లేకుండా ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న న్యాయవాది రామచంద్రారెడ్డి

పరిగి: సేవామందిరంలోని ప్రశాంత వృద్ధాశ్రమంలో సీనియర్ న్యాయవాది, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి జన్మదినం, మండలానికి చెందిన లాయర్ వన్నేరువప్ప కుమారుడు సాయి వర్షిత్ పుట్టిన రోజును బుధవారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ వన్నేరువప్ప, ఏపీపీ ఇందాద్, ఏజీపీ శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు సదాశివరెడ్డి, ప్రసాద్, శివశంకర్, రామచంద్రారెడ్డి కుటుంబసభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ప్రతిభ

హిందూపురం టౌన్: డిగ్రీ మూడవ సంవత్సరం ఫలితాల్లో పట్టణంలోని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరో సెమిస్టర్ ఫలితాల్లో బీఏ డిగ్రీలో 97 శాతం, బీకాంలో 92 శాతం విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారన్నారు. అలాగే ఫిబ్రవరిలో జరిగిన ఐదో సెమిస్టర్‌లో బీఎస్సీ విద్యార్థినులు 87 శాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. అలాగే డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందే విద్యార్థినులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకోవడానికి ఈనెల 25వ తేదీ వరకూ గడువు పొడిగించడం జరిగిందన్నారు. వివరాలకు అన్ని సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

హెల్మెట్ వాడకంపై నేడు ర్యాలీ

పెనుకొండ: పట్టణంలో హెల్మెట్ వాడకంపై గురువారం అంబేడ్కర్ సర్కిల్ నుంచి తెలుగు తల్లి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ బుధవారం తెలిపింది. మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ వాసుదేవన్, సీనియర్ సివిల్ జడ్జి బొజ్జప్ప, జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ సయ్యద్ పసపుల తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొంది.

వైభవంగా తొలి ఏకాదశి



మడకశిర మండలంలో వేణుగోపాల స్వామికి జ్యోతుల ఊరేగింపు



మడకశిర మండలం మెళవాయి నుంచి రంగనాథ స్వామి రథాన్ని దేవాలయం వద్దకు తీసుకెళ్తున్న భక్తులు



గుంతపల్లిలో లక్ష్మీనరసింహ స్వామికి జ్యోతులు మోస్తున్న మహిళలు

మడకశిర: తొలి ఏకాదశి వేడుకలను ప్రజలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని షిరిడీ సాయిబాబా, కోట వేంకటరమణ,అహోబిలం లక్ష్మీనరసింహ, ఆంజనేయస్వామి తదితర ఆలయాల్లో భక్తులు పూజలునిర్వహించారు.షిరిడీ సాయిబాబా ఆలయంలో భక్తులు భవద్గీత, విష్ణు పారాయణం చేశారు.

మడకశిర రూరల్: తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని భక్తరపల్లిలో లక్ష్మీనరసింహస్వామికి అభిషేకం, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మెళవాయిలో రంగనాథస్వామికి మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామికి సమర్పించారు. నీలకంఠాపురంలో లక్ష్మీనరసింహస్వామిని భక్తులు ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అమరాపురం: మండలంలోని హలుకూరులో లక్ష్మీ అమ్మవారికి మాల కులస్తులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో తొలి ఏకాదశి పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వివిధ రకాల పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. అలాగే మండలంలోని గౌడనకుంట, తమ్మడేపల్లి, వి.అగ్రహారం, అమరాపురం గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పావగడ: తాలూకాలోని కృష్టాపురంలో ఉన్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో తొలి ఏకాదశి వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ సమితి అధ్యక్షుడు వైపీ వెంకటపతి, కార్యదర్శి కే కస్తూరి రంగాచార్, ఉపాధ్యక్షుడు కే అనిల్, ట్రెజరర్ ప్రాణేశ్ రావ్ భక్తులకు సేవలందించారు. అలాగే పట్టణంలోని కణివె లక్ష్మీ నరసింహస్వామి, వేణుగోపాల స్వామి దేవాలయాల్లో పూజలు ఘనంగా నిర్వహించారు.

పెనుకొండ: పట్టణంలో మంగళవారం తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

గోరంట్ల: మండల వ్యాప్తంగా బుధవారం తొలి ఏకదశి పర్వదిన వేడుకలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుంతపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విశేష పూజలు చేపట్టారు. గుంతపల్లితోపాటు కొత్తపల్లి, పుట్టగుండ్లపల్లి, ఖాజాపురం గ్రామాలకు చెందిన మహిళలు స్వామికి జ్యోతులు మోశారు. గురువారం ఆలయ ప్రాంగణములో ఎడ్లబండ్ల ప్రదర్శన, శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఉట్లపరుష నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

పెనుకొండ రూరల్: మండలంలోని అడదాకులపల్లి, మావటూరు, నాగలూరు, శెట్టిపల్లి, గుట్టూరు, మునిమడుగు, గొనిపేట, దుద్దేబండ, రాంపురంలో బుధవారం తొలిఏకాదశి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు స్వామివార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు.

సోమందేపల్లి: కదిరేపల్లిలో తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. చల్లాపల్లి ఓబుళదేవరపల్లి నుంచి మహిళలు జ్యోతులను తలపై ఎత్తుకొని వచ్చి స్వామి వారికి సమర్పించారు. గ్రామస్తులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గురువారం ఉట్ల పరుష జరుగనుంది. తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని కదిరేపల్లి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి మాలగుండ్ల శంకర నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వైఎస్సార్ సీపీ నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, స్థానిక నాయకులు ఈశ్వర్, దాము, జితేంద్ర, హరీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిగి: బాలిరెడ్డిపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని దీపోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శాసనకోట నుంచి ఎడ్లబండ్లతో ఊరేగింపు నిర్వహించారు. అంతకు ముందు ఆలయం ఎదురుగా ఉట్ల మానును ప్రతిష్ఠించారు. గురువారం ఉట్ల మాను అధిరోహణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా కొడిగెనహళ్లి, పరిగి, మోదాలో షిర్డీ సాయిబాబా ఆలయాల్లో ఏకాదశి సందర్భంగా సంకీర్తనల నడుమ స్వామి వారి చిత్రపటాన్ని ఊరేగించారు.

ఆలయాల్లో భక్తుల సందడి

హిందూపురం/లేపాక్షి: తొలి ఏకాదశిని పురస్కరించుకుని హిందూపురంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. పేట వెంకట రమణస్వామి ఆలయాలో ఉదయం మూలవిరాట్ వెంకట రమణస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వెంకట రమణస్వామి ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం చేశారు. లేపాక్షి మండలం కల్లూరు, నాయనిపల్లి గ్రామాల సమీపంలో వెలిసిన కపిలేశ్వర స్వామికి పూజలు చేశారు. నాయనిపల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు ఎడ్ల బండ్లను ఊరేగించారు. నాయనిపల్లి, కల్లూరు గ్రామాలకు చెందిన వెంకటేశు, లక్ష్మీ నరసింహారెడ్డి, సూర్యనారాయణ, శంకరప్ప, కుళ్లాయప్ప, హరిప్రసాద్ తదితరులు అభిషేకార్చనలు, ఆకుపూజ, ప్రసాదాలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్, గ్రామ సర్పంచులు వసుంధర, రత్నమ్మతో పాటు ఇరు గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.



అమరాపురం: హలుకూరులో లక్ష్మీ అమ్మవారిని అలంకరించిన దృశ్యం



బాలిరెడ్డిపల్లిలో ఎడ్ల బండ్ల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం



పావగడ: వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు



లేపాక్షి: నాయనిపల్లిలో ఎడ్ల బండ్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి శంకర నారాయణ



కదిరేపల్లిలో జ్యోతులు మోసుకొస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

మడకశిర: పట్టణంలో బుధవారం మొహర్రం వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని తేరువీధి,గాంధీ బజార్,కోటవీధిలో పీర్లు కొలువుదీరాయి. హిందువులు, ముస్లింలు సమైక్యంగా అగ్నిగుండ మహోత్సవంలో పాల్గొన్నారు.పీర్ల వద్ద బొరుగులు, బెల్లం,చక్కెర చదివింపు పూజలు చేసి భక్తులకు పంపిణీ చేశారు. భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కుబడులను తీర్చుకున్నారు. సీఐ మనోహర్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ బ్రహ్మనందరెడ్డి తదితర పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అమరాపురం: మండల కేంద్రంలో మొహర్రం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మంగళవాం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకూ మొద్దులు, కట్టెలను అగ్నిగుండంలోనికి వేశారు. అనంతరం భక్తులు, యువకులు అగ్గి మీద నడస్తూ మొక్కులు తీర్చుకున్నారు.

రొళ్ల: మండలంలోని రత్నగిరి గ్రామంలో మొహరం వేడుకలు పురష్కరించుకుని బాబయ్య (పీర్ల) ఉత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున అగ్ని గుండం మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పలువురు భక్తులు అగ్నిగుండంలోకి ప్రవేశించి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా పీర్లను గ్రామాల్లో ఊరేగించారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు.

అగళి: మండలంలోని ఆలుడి గ్రామంలో మొహర్రం మేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయత్రం జలధి కార్యక్రమం నిర్వహించారు.

పావగడ: పట్టణంలో మొహర్రం వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబయ్య గుడి వెలసిన హుస్సేన్, హుస్సేన్ దేవుళ్లను ఊరేగించారు. బాబయ్య గుడి వీధి నుంచి తరలి వచ్చిన బాబయ్యల తో కలిసి రొప్పం, తళ్ళం బాబయ్యలు మధుగిరి ఊరు వాకిలి ద్వారా శిరా రోడ్డులో భారీ ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. అనంతరం బాబయ్యలను ఎస్ఎస్‌కే రంగ మందిరం ఎదుట ఉన్న కోనేరు కట్ట వద్ద జలధి నిర్వహించారు.

పెనుకొండ: పట్టణంలో బుధవారం సాయంత్రం పీర్ల జలధి జరిగింది. స్థానిక దర్గా రోడ్డులోని పీర్ల చావిడి నుంచి యువకులు, చిన్నారులు పెద్దయెత్తున అలాప్ ఆడుతూ ముందుకు సాగారు. అనంతరం ఫైర్ ఆఫీస్ వద్ద ఉన్న జెండా మాను వద్ద పీర్లకు జలధి కార్యక్రమం చేపట్టారు. దర్గా పీఠాధిపతి తాజ్ బాబా, ఆయన కుమారుడు సలా ఉద్దీన్‌బాబా, ముస్లీం, హిందూ మతపెద్దలు హాజరయ్యారు.

హిందూపురం: మొహర్రం పండుగను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం పట్టణంలో పెద్దఎత్తున పీర్లను ఊరేగించారు. పట్టణంలోని ముక్కిడిపేట, నేతాజీనగర్, మెయిన్ బజార్, తదితర ప్రాంతాల్లోని పీర్లచావడిలో కొలువుదీర్చిన పీర్లకు పది రోజులుగా భక్తిశ్రద్ధలతో చదివింపులు చేశారు. సాయంత్రం ఎంజీఎం గ్రౌండ్ వద్దకు అన్ని ప్రాంతాల పీర్లను తీసుకొచ్చారు.

లేపాక్షి: మండలంలోని బిసలమానేపల్లిలో పీర్లకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి అగ్నిగుండం చుట్టూ ఊరేగించారు. ఉదయం నుంచి చక్కర, బెల్లం, శనగపప్పులతో చదివింపులు చేశారు. అనంతరం యువత ఆనందంలో గుండం చుట్టూ అలాప్ తొక్కారు. భక్తులకు రొట్టెలు పంపిణీ చేశారు.



రొళ్ల మండల రత్నగిరిలో పీర్లను జలధికి తీసుకెళ్తున్న భక్తులు



పెనుకొండ: జలధి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



అమరాపురంలో..



బాబయ్య స్వాములను జలధి తరలిస్తున్న దృశ్యం



బాబయ్యను ఊరేగిస్తున్న దృశ్యం



లేపాక్షి: అలంకరణలో పీర్లు



హిందూపురంలో..

కార్యకర్తలకు అండగా ఉంటా

రొళ్ల: గ్రామస్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయడంతో పాటు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటామని నియోజకవర్గం సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. బుధవారం సాయంత్రం కొత్తపాళ్యం చెందిన పార్టీ మాజీ మండల కన్వీనర్ తిమ్మప్పతో కలిసి కర్ణాటక రాష్ట్ర శిర సమీపాన దాసరహళ్లిలో జరిగిన మారెమ్మ ఉత్సవానికి హాజరయ్యారు. అనంతరం రొళ్ల పట్టణం చేరుకుని పార్టీ శ్రేణులతో కలసి సమన్వయకర్త మాట్లాడారు. రాష్ట్రంలో 40 శాతం ఓటింగ్ వైఎస్సార్‌సీపీకి ఉందని ఆయన గుర్తు చేశారు. 2029లో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం ఖాయమన్నారు. పార్టీ శ్రేణులు అధైర్య పడకుండా పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సంతోష్, బీజీ హళ్లి సర్పంచ్ సదాశివప్ప, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప

పూజారి శివలింగప్పకు నివాళి

గుడిబండ: మండలంలోని మోపురుగుండు గ్రామానికి చెందిన పూజారి శివలింగప్ప (45) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయనకు భార్య లక్ష్మమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, జిల్లా సంయుక్త కార్యదర్శి జీబీ శివకుమార్ ఆ గ్రామానికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట లింగరాజు, శ్రీరామప్ప, లింగన్న ఉన్నారు.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి



ఏకలవ్యుడి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎరుకుల సంఘం సభ్యులు

మడకశిర: పట్టణంలోని శివాపురంలో బుధవారం ఎరుకుల సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, మండల అధ్యక్షుడు అనిల్, స్థానిక గంగన్న, శివలింగప్ప, హనుమంతప్ప, బాలాజీ, లక్ష్మయ్య, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

పరిగి: మండలంలోని 544ఈఈ జాతీయ రహదారిపై బుధవారం రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో ప్రమాదం తప్పింది. వివరాలు.. కర్ణాటక ప్రాంతమైన చిక్‌బళ్లాపూర్‌కు చెందిన వ్యక్తులు కారు పరిగి వైపు వస్తుండగా ఇదే మండలానికి చెందిన మరో కారు ఊటుకూరు క్రాస్ వద్ద ఢీకొన్నాయి. ఘటనలో కార్లలో ఉన్న వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న దాతలు

హిందూపురం టౌన్: మొహర్రం పురస్కరించుకుని అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ మానవతా రక్తదాన సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే మొహర్రం సందేశం అన్నారు. ప్రజాస్వామిక నియంతృత్వ పోకడలను ఎదుర్కొని ముహమ్మద్ ప్రవక్త తీసుకొచ్చిన న్యాయపాలనా విధాన పరిరక్షణకు ఇమామ్ హుసేన్ ప్రాణతర్పణ చేశారన్నారు. ఇస్లాం ధర్మ సంస్థాపన, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం హజరత్ అలీ కుటుంబం కర్బలా వీరులు చేసిన ప్రాణత్యాగాలను స్మరించుకుందామన్నారు. అనంతరం పలువురు రక్తదానం చేయగా వారికి డాక్టర్ చరణ్ సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆసిఫ్, ఉబేదుల్లా హుసేన్, షబ్బీర్, ఫైరోజ్ రఫీబ్, ఉమర్, సాధిఖ్, నస్రుల్లా, రియాజ్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా వీరచిన్నయ్య స్వామి జాతర



వీరచిన్నయ్య స్వామికి జ్యోతులు మోస్తున్న మహిళలు

రొద్దం: నారనాగేపల్లి గ్రామంలో వీరచిన్నయ్య స్వామి జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఆషాఢమాసంలో తొలి ఏకాదశ రోజున జాతర నిర్వహించటం ఆనవాయితీ. ఈసందర్భంగా ఆలయంలో స్వామికి అర్చనలు, అభిషేకాలు, ఆకుపూజ చేపట్టారు. అనంతరం మహిళలు స్వామికి జ్యోతులు మోసి మొక్కులు తీర్చుకున్నారు. రైతులు ఎడ్లబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. గ్రామంలో ప్రజలకు, పాడి పశువులు, పంటలకు ఏ కీడూ జరగదన్న నమ్మకంతో ఏటా జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రాత్రి 9 గంటల నుంచి గ్రామంలో వీరచన్నయ్యస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. తురకలాపట్నం బైలు అంజనేయస్వామికి జ్యోతుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు.



పూజలందుకున్న వీరచిన్నయ్య స్వామి